
శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు



# వినాయక చవితి వ్రతము

## పూజా విధానము, కథ

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech

# ప్రార్థన

శ్లో॥ శుక్లాంబరధరం, విష్ణుం, శశివర్ణం చతుర్భుజం।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయేత్॥

సీ॥ దేవతలందరన్ దీవించ వేడెదన్
శుభ అవసరమిది చూపకరుణ
ఆదినారాయణున్ ఆదిలక్ష్మిని గొల్తు
సిరులిచ్చి బ్రోవగ చెలిమి మీర
ఫాలాక్షుగూడిన పార్వతిన్ ప్రార్థింతు
ఆయురారోగ్యాలనంద జేయ
బ్రహ్మయ్య జతయైన వాణినే పూజింతు
వాక్శుద్ధితో జేయ పండితునిగ

తే॥ అష్ట దిక్పాలురందరన్ ఆశ్రయింతు
మ్రొక్కెదను నవగ్రహముల ముందునేను
తల్లిదండ్రుల గురువులనల్లమందు
భక్తిదలచుచు చేసెద వందనములు

ఆవె॥ చిట్టి ఎలుకనెక్కి చేతవుండ్రాళ్ళతో
బొజ్జ విరుగ దినెడి ఒజ్జకిపుడు
చేతుపూజనేను శివపార్వతీపుత్ర
నిందలంటకుండ నెరపుమయ్య!

చం॥ కనుగొన వామహస్తమున గజ్జెలుబూనెను
ఏకదంతుడున్
తనచిరుబొజ్జతో నడచు దాల్చిమొగంబున
లేత నవ్వులన్
ఘనమగు తొండమున్, కరుణ గమ్మిన జూపుల
పొట్టి దేవరా
మనమున కోరు విద్యలను మాకు నొసంగుము
నిన్నువేడెదన్

కం॥ అనుకోనిది జరుగుటయును
అనుకున్నది జరుగకుంట అదె విఘ్నమనన్
అనిమేషులైన గావుము
అని మ్రొక్కెదరయ్య నీకు అద్రిజ సూనీ!

కం॥ చేయించువారు కరువగు
చేయుటకా శక్తిలేదు సిరియుమితంబే
చేయుట తెలియదు వ్రతమును
చేయెత్తుచు మ్రొక్కగలను శివప్రియ తనయా!

కం॥ వెరవరు నిందకు ఇప్పుడు
వెరతురె అపనిందకేమి వింతర! నరులున్
వెరతురు పనిచెడు ననుచును
వెరపున నిను గొలుతురయ్య విఘ్నగణేశా!

## అంకితం

కం॥ గణపతి గెల్చుట కనుగొని
గొణగక తనఅన్నగారి గొప్పతనముకున్
అణకువనౌనను స్కందుని
కణకువ ప్రార్థించి దీనినంకితమిత్తున్

# సంకల్పం

## ఓం విఘ్నాధిపతయే నమః

అనంత విశ్వమున సౌరమండలంలోని భూగోళమనే ఈ వసుంధరలోని ఆసియా ఖండమునగల భారతదేశములోని ......... రాష్ట్రమున ......... జిల్లాలోని ....... మండలం యందలి ......... పట్టణ/నగర/గ్రామమున నివసించు ......... గోత్రమున ......... వారి ఇంట జన్మించి శ్రీ ......... అనుపేరుగల నేను శ్రీమతి ......... అనునా ధర్మపత్నితోనూ, మా సంతానము, వారి కుటుంబములు, బంధుమిత్ర పరివారముతో, క్రీ.శ. ......... సంవత్సర ......... మాసమున ............ దినమున ......... గంటల ......... నిమిషములకు నా స్వగృహమున, (వసతి గృహమున) శుభ ఘడియల సుముహూర్తమున సర్వదేవతల, నారాధించి వారి ప్రీతికై శ్రీ విఘ్నేశ్వర చతుర్థినాడు సిద్ధి వినాయక వ్రతమును చేసెదను గాక. ఈ నా సత్సంకల్పము నాచరించుటకు, దాని మంచి ఫలితమునందు నాకు జగత్తునకు కళ్యాణములు శుభములు జరుగుటకు, భగవంతుడు అనుకూలించుగాక.

# కేశవ నామాలు

ఓం కేశవాయ స్వాహా ఓం నారాయణాయ స్వాహా
ఓం మాధవాయ స్వాహా

(అంటూ మూడు సార్లు చెంచాతో గ్లాసులోని నీళ్ళు కుడి అరచేతిలో పోసుకుని త్రాగాలి. పూజలో కూర్చున్న మిగతావారికి త్రాపాలి. మిగతా నామాలు ఇలా చదవాలి)

ఓం గోవిందాయ నమః, ఓం విష్ణవే నమః
ఓం మధుసూదనాయ నమః, ఓం త్రివిక్రమాయ నమః
ఓం వామనాయ నమః, ఓం శ్రీధరాయ నమః
ఓం హృషీకేశాయ నమః, ఓం పద్మనాభాయ నమః
ఓం దామోదరాయ నమః, ఓం సంకర్షణాయ నమః
ఓం వాసుదేవాయ నమః, ఓం ప్రద్యుమ్నాయ నమః
ఓం అనిరుద్ధాయ నమః, ఓం పురుషోత్తమాయ నమః
ఓం అధోక్షజాయ నమః, ఓం నారసింహాయ నమః
ఓం అచ్యుతాయ నమః, ఓం జనార్ధనాయ నమః
ఓం ఉపేంద్రాయ నమః, ఓం హరయే నమః
ఓం శ్రీకృష్ణాయ నమః

# షోడశోపచార పూజ

సీ॥ ధ్యానంబు జేసెదన్ ద్వైమాతురాయనిన్
ఆవాహనము స్కందునగ్రజునకు
ఆసనంబిచ్చెదన్ అగ్రగామికినిదే
అర్ఘ్యంబిదే పంచహస్తునికిని
పాద్యంబు నిచ్చెదన్ పార్వతీ సుతునకున్
ఆచమనంబిదే ఆ సుముఖుకు
స్నానంబు జేయింతు సర్వసిద్ధునకును
వస్త్రయుగ్మము మహాబలునికిత్తు
ఉపవీతమొసగెదన్ పూష్ణుని కిప్పుడే
గంధాక్షతలు మహాగణపతికిని
ధూపంబు దీపంబు ధూర్జటి బిడ్డకున్
పుష్పాలనుమసుతున్ పూజచేతు

తే॥ పెడుదు నైవేద్యమును నేను విఘ్నపతికి
హారతిత్తును, మంత్రపుష్పంబు జదివి
ధృతి మతికి జేతు దండ ప్రదక్షిణములు
షోడశోపచారంబులు నేడు జేతు

# అథాంగ పూజ

నమస్కరించి గణేశుని పాదములను పూజింతును
,, ఏకదంతుని గుల్భములను ,,
,, సర్వ సిద్ధుని జానువులను ,,
,, సతోర్థితుని జంఘములను ,,
,, అఖవాహనుని యూరువులను ,,
,, హేరంబుని నడుమును ,,
,, లంబోదరుని ఉదరమును ,,
,, గణనాధుని నాభిని ,,
,, హ్రస్వగ్రీవుని హృదయమును ,,
,, స్థూల కంఠుని కంఠమును ,,
,, స్కందాగ్రజుని స్కందములను ,,
,, పాశహస్తుని హస్తములను ,,
,, గజవక్త్రుని వక్త్రమును ,,
,, విఘ్నహంత్రుని నేత్రములను ,,
,, శూర్పకర్ణుని చెవులను ,,
,, పాలచంద్రుని లలాటమును ,,
,, సర్వేశ్వరుని శిరమును ,,
నమస్కరించి విఘ్నరాజుని సర్వాంగములను పూజించెదను

# అథైకవింశతి పత్రపూజ

సుముఖునికి నమస్కరించి మాచీపత్రముతో పూజించెదను

గణాధిపునికి నమస్కరించి బృహతీపత్రముతో ”

ఉమాపుత్రునికి నమస్కరించి బిల్వపత్రములతో ”

గజాననునికి నమస్కరించి దూర్వాయుగ్మముతో ”

హరసూనునికి నమస్కరించి దుత్తూర పత్రముతో ”

లంబోదరునికి నమస్కరించి బదరీ పత్రముతో ”

గుహాగ్రజునికి నమస్కరించి అపామార్గ పత్రముతో”

గజకర్ణునికి నమస్కరించి తులసీ పత్రముతో ”

ఏకదంతునికి నమస్కరించి చూతపత్రముతో ”

వికటునికి నమస్కరించి కరవీరపత్రముతో ”

భిన్న దంతునికి నమస్కరించి విష్ణుకాంత పత్రముతో”

వటువునికి నమస్కరించి దాడిమీ పత్రముతో ”

సర్వేశ్వరునికి నమస్కరించి దేవదారు పత్రముతో ”

ఫాల చంద్రునికి నమస్కరించి మరువక పత్రముతో ”

హేరంబునికి నమస్కరించి సింధువారపత్రముతో ”

శూర్పకర్ణునికి నమస్కరించి జాతీ పత్రముతో ”

సురాగ్రజునికి నమస్కరించి గండకీ పత్రముతో ”

ఇభవక్త్రునికి నమస్కరించి శమీపత్రముతో ”

వినాయకునికి నమస్కరించి అశ్వత్థ పత్రముతో ”

సురసేవితునకు నమస్కరించి అర్జున పత్రముతో ”

కపిలునికి నమస్కరించి అర్కపత్రముతో ”

శ్రీ గణేశ్వరునికి నమస్కరించి ఏకవింశతిపత్రముతో పూజించెదను.

# శ్రీ వినాయకాష్టోత్తర శతనామావళిః

(ప్రతీ పేరునకు చివర నమః అనుకోవలెను)

ఓం గజాననాయ నమః

ఓం గణాధ్యక్షాయ

ఓం విఘ్న రాజాయ

ఓం వినాయకాయ

ఓం ద్వైమాతురాయ

ఓం ద్విముఖాయ

ఓం ప్రముఖాయ

ఓం సుముఖాయ

ఓం కృతినే నమః

ఓం సుప్రదీపాయ 10

ఓం సుఖనిధయే

ఓం సురాధ్యక్షాయ

ఓం సురారిఘ్నాయ

ఓం మహాగణపతయే

ఓం మాన్యాయ

ఓం మహాకాలాయ

ఓం మహాబలాయ

ఓం హేరంబాయ

ఓం లంబజఠరాయ

ఓం హ్రస్వగ్రీవాయ 20

ఓం మహోదరాయ

ఓం మదోత్కటాయ

ఓం మహావీరాయ

ఓం మంత్రిణే

ఓం మంగళ స్వరాయ

ఓం ప్రమథాయ

ఓం ప్రథమాయ

ఓం ప్రాజ్ఞాయ

ఓం విఘ్నకర్త్రే

ఓం విఘ్నహంత్రే 30

ఓం విశ్వనేత్రే

ఓం విరాట్పతయే

ఓం శ్రీపతయే

ఓం వాక్పతయే

ఓం శృంగారిణే

ఓం అశ్రితవత్సలాయ

ఓం శివప్రియాయ

ఓం శీఘ్రకారిణే

ఓం శాశ్వతాయ

ఓం బలాయ 40

ఓం బలోత్థితాయ

ఓం భవాత్మజాయ

ఓం పురాణ పురుషాయ

ఓం పూష్ణే

ఓం పుష్కరోక్షిప్త ధారిణే

ఓం అగ్రగణ్యాయ

ఓం అగ్రగామినే

ఓం మంత్రకృతే

ఓం చామీకర ప్రభాయ 50

ఓం సర్వస్మై

ఓం సర్వోపాస్యాయ

ఓం సర్వకర్త్రే

ఓం సర్వనేత్రే

ఓం సర్వసిద్ధిప్రదాయ

ఓం సర్వసిద్ధియే

ఓం పంచహస్తాయ

ఓం పార్వతీనందనాయ

ఓం ప్రభవే

ఓం కుమారగురవే 60

ఓం అక్షోభ్యాయ

ఓం కుంజరాసురభంజనాయ

ఓం ప్రమోదాయ

ఓం మోదకప్రియాయ

ఓం కాంతిమతే

ఓం ధృతిమతే

ఓం కామినే

ఓం కపిత్థఫలప్రియాయ

ఓం బ్రహ్మచారిణే

ఓం బ్రహ్మరూపిణే 70

ఓం బ్రహ్మ విద్యా విధాయకాయ

ఓం జిష్ణవే

ఓం విష్ణుప్రియాయ

ఓం భక్తజీవితాయ

ఓం జితమన్మథాయ

ఓం ఐశ్వర్యకారణాయ

ఓం జ్యాయసే

ఓం యక్షకిన్నర సేవితాయ

ఓం గంగాసుతాయ

ఓం గణాధీశాయ 80

ఓం గంభీరనినదాయ

ఓం వటవే

ఓం అభీష్టవరదాయ

ఓం జ్యోతిషే

ఓం భక్తనిథయే

ఓం భావగమ్యాయ

ఓం మంగళప్రదాయ

ఓం అవ్యక్తాయ

ఓం అప్రాకృత పరాక్రమాయ

ఓం సత్యధర్మిణే 90

ఓం సఖయే

ఓం సఖ్యైసరసాంబు నిథయే

ఓం మహేశాయ

ఓం దివ్యాంగాయ

ఓం మణికింకిణీ మేఖలాయ

ఓం సమస్త దేవతామూర్తయే

ఓం సహిష్ణవే

ఓం సతతోత్థితాయ

ఓం విఘ్నాంతకారిణే

ఓం విశ్వదృశే 100

ఓం విశ్వరక్షాకృతే

ఓం కళ్యాణగురవే

ఓం ఉన్మత్తవేషాయ

ఓం అపరాజితే

ఓం సమస్త జగదాధారాయ

ఓం సర్వైశ్వర్యప్రదాయ

ఓం ఆక్రాంత చిదచిత్ప్రభవే

ఓం విఘ్నేశ్వరాయ 108

ఓం శ్రీ వరసిద్ధి వినాయక స్వామినే నమః

# వినాయక చవితి వ్రత కథ

## గజాసుర వృత్తాంతం

కం॥ శ్రీ విఘ్ననాథు చరితను
కోవిదుడా సూతుడపుడు కూడిన మునులన్
బ్రోవంగ శౌనికాదుల
తావినిపించంగబూనె ధన్యులజేయన్

వ॥ వినాయకుని జననము, చంద్రదర్శన దోషకారణము,
దాని ఫలితము, నివారణోపాయము జెప్పసాగెను.

ఉ॥ తొల్లి గజాసురుండు దయతో కనిపించిన
శంకరున్ మహిన్
చల్లగ కోరె నిల్వమని చక్కగ పొట్టలో దాని
కాతడున్
వల్లెయనంచు బల్కి అటుపాయక నిల్చెను
భక్తుకోర్కెకున్
ఉల్లము ప్రీతిజేయుటకు ఉండెను అవ్విధి
చింతవీడుచున్

తే॥ హరుని గానక పార్వతి అద్రి తనయ
హరిని వేడెను వైకుంఠుడామె కొరకు
ఆ గజాసురు వధియింప తగిన విధిని
బూని బ్రహ్మతో సురులతో పుడమి జేరె

కం॥ నందిని డూడూ బసవని
చందంబున సిద్ధపరచి సరసిజ భవుతో
అందరు సురులతొ ఆ గో
విందుడు తాజేరెనసురు విరువగ వానిన్

ఆ॥ అసురు జేరి తాను ఆడించె బసవని
మోదమంది అసురుడీదలెంచె
వరము ఏదియైన వారల ప్రీతికై
కోరుడనెను నవ్వి సురులవైరి

ఆ॥ హరుని వాహనంబు ఆతనికైవచ్చె
దీని శివునినిమ్ము దానవేంద్ర
మేము దేవతలము మేకోరునది వేరు
ఏమికలదు? చూడనింతకన్న

వ॥ వెనువెంటనే తన తప్పిదము గ్రహించిన గజాసురుడు అత్యాశతో శివునే తనవద్ద నిర్బంధించిన తనకు మృత్యువే శిక్ష అని గ్రహించి ఉదరమున నున్న శివునికిట్లు చెప్పెను.

కం॥ ఓ హర! చేసితినెంతో
ద్రోహము మదమెక్కి నీకు తులువను దేవా!
నే హర భక్తుడ నాదగు
దేహము శిరమును ప్రసిద్ధి దేలగ గొనుమా

వ॥ దానికి శివుడంగీకరించి అట్లే జేతుననుచు వరమొసంగెను.

తే॥ శృంగముల నంది బొడిచెను చచ్చెనతడు
శివుడు వెలువడె ప్రేమతో జెప్పె హరియు
అసురులందరికీ రీతి అమిత ప్రీతి
వరములీరాదు ఓ దేవ! బాధ కలుగు

కం॥ నాకే కాక గిరిజకున్
చేకూడెను పీడ నిజము చెప్పెద వినుమా
ఈ కరిదనుజుడు భక్తుడు
నీకును కానితడు దుష్ట నీతికి ప్రియుడున్

తే॥ ఎంత వగచెను నీసతి ఈవురాక
చింత నొందెను శర్వాణి చిన్నబోయె
వార్తనంపుము ముందుగా పార్వతికిని
నీదు రాకను శాంతించు నీ ప్రియసతి

తే॥ తనదు స్వంతము పరమాత్మ తలచి బంధి
చేయయత్నించు వానికి శిక్షకాదె?
వీని చరితము కనులకు విప్పు కలుగ
జేసి భావి భక్తుల మేలు జేయుగాక.

# వినాయక జననం

కం॥ సతికంపె తనదు రాకను
అతిసంతస వార్త వినుచు అద్రిజ తానున్
పతికై సంబర పడుచున్
అతి ప్రేమతొ సిద్ధమయ్యె ఆత్రుతతోడన్

వ॥ ఆ పార్వతీదేవి అభ్యంగన స్నానమాచరించ దలచి నలుగు పెట్టుకుని మిగిలిన ఆ నలుగు పిండితో చిన్నబాలుని బొమ్మను జేసినది. తనుచేసిన ఆ బొమ్మపై మిక్కిలి అనురాగము కలిగి బ్రహ్మదేవుని ప్రార్థించి ఆ బొమ్మకు ప్రాణము పోయించగా, ముద్దులొలుకు బాలుడు రూపుజెందెను. సంకల్ప జనితుడైన ఆ చిన్నారిని ముద్దాడి తన వాకిట నుండి ఎవరినీ లోపలికి రానీయవలదని, స్నానము జేయుటకు బోయినది.

ఆ॥ శివుడు వడిగ జేరి చిన్నారి జూచియు
ధ్యాసపెట్టడాయె తత్తరాయె
లోన పోదునన్న రుద్రుని పోనీక
బాలుడడ్డుకొనెను పరమ శివుని

కం॥ చెప్పిన మాటను వినడయె
తప్పించుకపోవ కాదు తనకడ్డుపడెన్
అప్పుడు అలిగినవాడై
అప్పరమేశ్వరుడు శూలమందుచు విసిరెన్

ఆ॥ తెగెను శిరము కాని ఆగడు ధూర్జటి
ఆ గిరిజను చూడ ఆత్రమాయె
ఆదిదంపతులకు ఆనంద కలయిక
అతి పరవశమొంది అలరినారు

వ॥ చాలరోజుల తరువాత కలిసిన ఆ ఆదిదంపతులు కుశల సమాచారము అడుగుచున్నప్పుడు మాటల మధ్య బాలుని ప్రసక్తి వచ్చి మహాదేవుడు జరిగిన సంగతి వివరించగా శర్వాణి అయ్యో మన పుత్రుని ఇట్లు వధించిరే అని వగచెను.

కం॥ గౌరిని వగచుట వలదని
ఊరట చెందంగ జెప్పి ఉమప్రియపతియున్
కోరినదనుజుని శిరమును
తీరుగ అతికింపజేసి దీర్చెను బాలున్

వ॥ పరమేశ్వరుడే తలచుకుంటె కానిది ఏముంటుంది? ఆ బాలునికి ప్రాణముల నొసంగుటే గాక తోరపు బొజ్జయు మెల్లని చూపులు, మందహాసముగలవానిగా జేసి గజాననుండని పేరిడి గౌరి కొసంగెను. ఆమె ఏనుగు తలగల నా కుమారుని నేనెట్లు చూడగల ననగా తల్లిదండ్రులకు పూర్వపు అందమైన ముఖము కన్పించుననియు ఇతరులకు మాత్రము గజాననము కనిపించునని చెప్పెను.

గజాననుడు తిరుగుటకు అనింద్యుడు అను ఎలుకను వాహనముగా నొసంగిరి. ఆతడు తనతల్లిదండ్రులను భక్తి శ్రద్ధలతో పూజించు చుండెను.

కం॥ తారకుడను దనుజేశుడు
మీరెను, చంపంగ వాని మేదిని వెలసెన్
ఆ రమణీ మణి పార్వతి
కా రుద్రుని కరుణ వలన అటు స్కంధుండున్

కం॥ దివి సేనకాతడధిపతి
అవిరళమతని ప్రతాపమతి సుందరుడున్
సవినయవంతుండాతడు
కవి పండిత జనప్రియుండు గౌరవమందున్

వ॥ అతని వాహనము నెమలి. అతనికి కుమారస్వామి సుబ్రహ్మణ్యుడు అని పేర్లు గలవు. నెమలిపై రివ్వున ఎగిరిపోగలడు. ఇది ఇట్లుండగా...

## చంద్రదర్శనదోషం, దాని నివారణ

తే॥ విఘ్నములు బాపు నాధుకై వేడె నరులు
దేవ దానవుల్ ఆ మహాదేవు జేరి
మీ కుమారుల నొక్కని మేము గొలువ
అనుమతీయుము విఘ్నాల అధిపుజేసి

వ॥ వల్లెఅని నీలకంఠుడు బలికి తాను తన కుమారులిరువురిలో మూడు లోకములలోగల నదులన్నిటిలో స్నానమాచరించి తన ముందుకు ముందుగా ఎవరు వత్తురో ఆ ప్రథమునికి ప్రమద గణాధిపత్యమిత్తుననెను. అది వినినంతనే కుమారస్వామి నెమలి నెక్కి క్షణమైననాగక ఎగిరిపోయెను. ఇది జూచి ఖిన్నుడైన గజాననుడు తండ్రికిట్లనెను.

తే॥ ప్రథమ పుత్రుడ మరణించి బ్రతికినాడ
శిరము కరిదాయె, బొజ్జాయె చేయలేను
శ్రమను, ఇటువంటి పందెము శక్యమౌనె
అనుజుచేత ఓటమి నాకు అవునె మేలు?

వ॥ అట్లు దీన వదనుడైయున్న ప్రియ పుత్రుని జూచి త్రిశూలిట్లనెను.

కం॥ ఇది విను పార్వతి నందన!
ముదముగ ఆ విష్ణు దలచి ముమ్మారులు నీ
మదిగొని మాతా పితరుల
కిదియే ప్రదక్షిణంబు నిటజేయుమయా

వ॥ ఆమాట వినిన గజాననుడు మిక్కిలి సంతసించి ఓం నమోనారాయణాయ అనుచు ముమ్మారులు తల్లిదండ్రుల జుట్టూ ప్రదక్షిణంబు జేసి నారాయణ మంత్రము పఠించుచూ సుఖంబుగానుండెను. అక్కడ...

తే॥ తాను నెమలిపై భువిలోన తనరుచున్న
నదుల స్నానము చేయనై నడచు చుండ
అతనికెదురయ్యె ప్రతిచోట అగ్రజుండు
స్నానమున్ జేసి ముందుకు సాగునట్లు

కం॥ వేగము పెంచెను స్కందుడు
ఆగడు ఒకచోటనైన అలసట దీరన్
సాగెను అగ్రజునధికము
చేగలిగిన దేమిలేక చేతులు మోడ్చెన్

వ॥ అట్లు త్రిలోకములందలి నదులన్నిటిలో తనకంటే
ముందు స్నానమాచరించి కైలాసముననున్న
గజాననుని గాంచి వినమ్రుడై తన అహంకారమే
తన ఓటమి కారణమని గుర్తించి ఆ
సుబ్రహ్మణ్యుడిట్లనెను.

ఆ॥ అన్న! ఓడినాను అర్హుడవీవయ్య
గణపతివని నిన్ను గౌరవించ
దగుననంచుబల్కి తనవోటమిందెల్ప
స్కందుజూచి శివుడు సంతసించె

వ॥ అప్పుడు ఆ గజాననునికి గణాధ్యక్ష పదవి ఒసంగెను. అందరూ కీర్తించి గణపతిని పూజించి వానికిష్టమైన ఉండ్రాళ్ళు అప్పములు మొదలైన పిండివంటలతో సుష్ఠుగా విందుజేసిరి. అవియన్ని తినలేక కొన్ని అనిందుృన కొసగి, ఆయాస పడుచూ రాత్రివేళకు కైలాసము జేరెను. అది భాద్రపద శుద్ధ చవితి. శివుని జటా జూటమున చంద్రుడు మిల మిల మెరయుచుండెను.

ఆ॥ తల్లిదండ్రిజూచి తనయుడు భక్తితో
వందనంబు జేయ వంగబోయె
పొట్ట అడ్డమొచ్చి భూమిని తాకవు
కాళ్ళు చేతులొక్క కాలమందు.

కం॥ సతమతమయ్యేడి ఆ గణ
పతినే తనుజూచి నవ్వె పకపక చంద్రుం
డతిహేయమైన రీతిగ
అతనికి పోగాలమొచ్చెనాయనిపించన్

వ॥ దుష్టుని దృష్టికి రాళ్ళైనా పగులునన్నట్లు ఆ గణపతి బొజ్జ పగిలి మరణించెను. అతని పొట్టలోని తినుబండారములు ఎల్లెడలా విరజిమ్మబడెను. ఆతండును మృతి చెందెను.

కం॥ కన్నీట మునిగి పార్వతి
అన్నది ఈరీతి తులువ! హంతక! చంద్రా!
నిన్నెవడు చూచు నింగిని
ఎన్నో నీలాపనింద లిలగను నికపై

వ॥ ఆ శాపము వలన ఆ క్షణమున ఇక్కడ భూలోకమున సప్తఋషులాచరించు యజ్ఞమున ఋషి పత్నులను చూచి మోహించి వ్యాకుల పడుచున్న భర్త అగ్నిదేవుని జూచి......

ఆ॥ విరహ వేదనంది వేసారె పోవకుం
డతని పత్ని 'స్వాహ' అతను శాంతి
నొంద మారి తాను ఋషి పత్నులట్లుగా
పతికి ప్రీతి జేసె పలువిధముల

**వ॥ శాప భయంబున ఆమె అరుంధతి రూపము ధరించక యున్నది. తక్కిన అందరి భార్యలవలె ఆమె రూపము ధరించి పతిని ఆనందపరచ సాగినది.**

ఆ॥ కామకేళి జూచి కన్నున గోపించి
మునులు వీడినారు ముద్దు సతుల
నారదుండు నిజము నయముగ నెరిగింప
మునుల కాపురముల ముప్పుదప్పె

కం॥ గిరిజకు జరిగిన సంగతి
నెరిగించుచు బ్రహ్మబల్కె ఈ శాపముచే
జరుగదు మానవలోకము
నరకంబగు నమ్మ విశ్వనాధుని రాణీ

వ॥ అని జెప్పి గణపతిని తిరిగి సజీవుని జేసి, గౌరిని శాంతింప జేసెను. ఆమెను శాపమునుపసంహ రింపుమని వేడెను.

తే॥ భాద్రపద శుద్ధ చవితిని వదలి అన్య
దినములందున నా శాప తీవ్రతుండ
బోదు అనిజెప్ప, దానికి ముదమునంది
బ్రహ్మ, నారదుచే దీని వసుధ దెలిపె.

వ॥ నాటినుండి ప్రజలు ఆ భాద్రపద శుద్ధ చవితిని విఘ్న చతుర్థి అనియు వినాయక చవితి అనియు పిలిచి, నాడు చంద్రదర్శనము జేయక జాగ్రత్తగా యుండిరి.

# శ్యమంతకమణి గాధ

వ॥ ద్వాపర యుగమున శ్రీకృష్ణుని ద్వారకలో కలిసి నారదమహాముని.....

ఆ॥ విఘ్నచవితి నేడు వినుమయ్య నామాట
చంద్రదర్శనంబు సలుపరాదు
నిద్ర జేర మేలు నీవారి కెరిగింపు
భద్రపడగ జెప్పు వాసుదేవ!

ఆ॥ చనియె నారదుండు తనువచ్చు దారినే
'టముకు' వేయజేసె తాను హరియు
పాలు త్రాగ నెంచి వాసుదేవుడు తాను
గొడ్ల కోష్టమందు గూడె తాను

ఆ॥ పాలు పితుకుచుండ పరధ్యానమగుటచే
పాలగిన్నెలోన పద్మనాభు
డంత చంద్రుగాంచి ఆయెడ చింతించె
నిందలేవి విందు ముందుముందు

వ॥ అయిననూ చేయునదేమియూ లేక కాలము గడుపసాగెను. ఆ ద్వారకలోనే శ్రీకృష్ణునితో మైత్రీ భావములేని సత్రాజిత్తు అను యాదవుడుండెను. అతనికి ప్రసేనుడు అను దురభిమానియైన తమ్ముడు సత్యభామయను చక్కని పుత్రికయు గలరు.

ఆ॥ సూర్యదేవు గొల్చుచుండె సత్రాజిత్తు
వాని గళమునున్న వాసిగన్న
దౌ'శ్యమంతకంబు' తరుగని మహిమను
కలుగు మణిని వరముగాంచతాను

కం॥ ఎనిమిది బారువులయ్యేడి
ఘనమగు బంగరు నొసంగ గలదా మణియున్
దినమున కొక పరి వీడక
తన భక్తుని కోర్కెదీర తప్పని సరిగా

వ॥ కఠోర దీక్షతో తపమొనరించు ఆ సత్రాజిత్తునకు సూర్య భగవానుడు ప్రత్యక్షమై ఆ శ్యమంతక మణిని వానికి వరముగ నిచ్చెను. ఆ మణి యిచ్చు బంగారముతో సత్రాజిత్తు స్వల్పకాలమున గొప్ప శ్రీమంతుడై సంతోషమున నుండెను.

ఆ॥ కృష్ణుడతని తాను కలిసి ఇట్లడిగెను
రాజుకిమ్ము మణిని ప్రజకు మేలు
గర్వమెక్కినట్టి ఖలుడు సత్రాజిత్తు
మంచినెంచకుండ మాటజారె

కం॥ మరలెను కృష్ణుడు కానీ
దరుగని అనుమానమెక్కి తన మదిచెడగా
దరిబిల్చి తనదు తమ్ముని
బరచెను కావంగ మణిని వ్యర్థుండంతన్

వ॥ ఆ ప్రసేనుడు మణిని ఒకహారమున బెట్టి తనమెడలో ధరించి అన్నగారికి ప్రతిదినము పూజవేళకు అందించ సాగెను. తక్కిన వేళ అది తనమెడలోనే ధరించి తిరుగుచుండెను.

తే॥ ఆ ప్రసేనుడు ఒకనాడు అడవిలోన
వేటమత్తుడై సింగంబు వెంటదరుమ
పోరి హతుడయ్యె, గళముననున్న మణిని
గొంచు బోయెను మాంసమనెంచి మృగము

ఆ॥ ఎలుగుబంట్ల రాజు ఇల జాంబవంతుండు
రావణవధ నంతరంబుదాను
రాము గొల్చుచుండి రామావతారపు
అంతమయిన పిదప అచట బ్రతికె

ఆ॥ బంధమొకటి గూడె, భల్లూక వల్లభున్
పుత్రివోలె పెంచె పూనితాను
చాన నొక్కదాని జాంబవతని బిల్చి
ఆమె ప్రాణమయ్యె అతనికెంతో

వ॥ ఆతడు ప్రసేనుని జంపిన సింహమును సంహరించి ఆ మణిని తన ప్రియ పుత్రికకు హారముగా ధరించుట కిచ్చెను. ఇచ్చట ద్వారకలో మూర్ఖుడైన సత్రాజిత్తు....

కం॥ తమ్ముని గానక వగచుచు
నెమ్మది కృష్ణయ్య మీద నీచము బెరగన్
తమ్ముని జంపియునాపై
అమ్మణి నపహరణ జేసెనని నిందించెన్

వ॥ ఇది అంతయూ చవితి చంద్రుని జూచిన ఫలమని గ్రహించిన శ్రీకృష్ణుడు యాదవులనందరిని రప్పించి సంగతి వివరించి....

కం॥ నింద భరింతును నాపై
నిందను బాపుటకు బోదు నేకానలకున్
ఎందున్నన్ మణిదెత్తును
అందాకా ద్వారకందు అడుగిడనయ్యా!

వ॥ అనిజెప్పి శ్రీకృష్ణుడు ప్రసేనుడు వెళ్ళిన వనమునకే బోయి వెదికెను.

కం॥ గాంచె ప్రసేనుని దేహము
గాంచెను మృగరాజు శవము కడు చోద్యముగా
గాంచడు శ్యమంతకంబును
మంచిగతా వెదకి గూడ మాధవుడచటన్

వ॥ కానీ అక్కడ ఒక భల్లూకము సింహము పోరుసల్పిన గుర్తులు, అడవిలోనికి బోవుచున్న భల్లూకపు కాలి గుర్తులు కనబడెను.

కం॥ అడుగుల వెంబడి పోయెను
విడువక పంతంబు హరియు వెదకగ వనిలో
మెడలో మణినే దాల్చిన
పడుచును ఒకదానిగాంచె వనిగుహయందున్

కం॥ కొమ్మా! నామణి నాకే
ఇమ్మా పుణ్యంబునీకు ఇదివిని నంతన్
అమ్మణి దాల్చిన సుందరి
రమ్మని తనదండ్రి బిల్చె రయమున నటకున్

వ॥ ఆమె తండ్రియే జాంబవంతుడు. ఆతడు
రామభక్తుడు అయిననూ శ్రీమహావిష్ణుని
రామావతారమునాటి దానవులందరూ రాజులుగా
అవతరించగా వారి సంహరణార్థమై జన్మించిన
శ్రీకృష్ణునిగా గుర్తించలేక అతి భయంకరుడై....

ఆ॥ అరచి, గోళ్ళరక్కి, ఆ జాంబవంతుండు
రాళ్ళు విసిరి తాను రభస జేసె
ముష్ఠియుద్ధమందు మురవైరితో దాను
బోరె దినము లాయె ఇరువదెంది

కం॥ నలిగెను దేహము, చితికెను
కలిగిన తన ఎముకలన్ని, గాయాలయ్యెన్
తొలగెను ధైర్యము ఆపై
ఎలుగులపతి కరములెత్తి ఇట్లనె హరికిన్

వ॥ నీవు ఎవరవు? నన్నిట్లు చేయగల శక్తి నా రామునికి దప్ప వేరికుండును? నన్ను గరుణించి దెలుపుము.

కం॥ మెల్లగ మృదువుగ నవ్వెను
నల్లని ఆ కృష్ణుడంత నయముగ బలికెన్
చల్లగ ~~ఈ~~తీరున ఆ
భల్లూకపు రాజుకపుడు భయమును దీర్పన్

వ॥ ఓ జాంబవంతా! జ్ఞప్తిదెచ్చుకొనుము, త్రేతాయుగమున రావణ వధ తరువాత శ్రీరామ పట్టాభిషేక సమయమున నీకు ఏ కానుక కావాలెనని ఆ రామచంద్రుడు నిన్నడుగగా రామునితో మల్ల యుద్ధము వాంఛించితివి. అది ఆ యుగమున గాక ద్వాపరయుగమున దీర్తునంటిని. ఎందుకో తెలిసినదా? రాముని నీవు బలముగ తన్నలేవు.

కం॥ నేనే రాముడనయ్యా!
నేనే కృష్ణుండ భ్రమతొ నీవెరుగవుగా
నేనీకోర్కెను దీర్పగ
నేనిను హింసించినాను నిను మన్నింపన్

తే॥ చూపి రాముని రూపము సొక్కుదీర్చి
నిమిరె మృదువుగ దేహము నీలవర్ణు
డంత, కాళ్ళపై బడి వేడె ఆ ఎలుగుల
పతియు ఇట్లనె కన్నీరు వరద కాగ

వ॥ ఓ ప్రభూ! అజ్ఞానిని, అహంభావిని, నీ చరణదాసుడను. దాసుని తప్పులు దండముతోసరి అందురు కదా. నన్ను క్షమింపుము. ఇకపై విరాగినై తాపసినై బ్రతికెదను. కాని.....

కం॥ ఉన్నది బంధము పుత్రిక
అన్నులమిన్నగును దేవ! ఆ బాలికకున్
మిన్నగ నీవే పతి వై,
నన్నేలుము మామ జేసి నళినదళాక్షా!

వ॥ దానికి శ్రీకృష్ణుడు అంగీకరించి జాంబవతిని గైకొని శ్యమంతకముతో బాటు ద్వారకజేరెను.

తే॥ పిలిచి పెద్దలనందర పేరొలగము
నందు కృష్ణుడు జరిగిన దంత దెలిపె
కంట నీరు సత్రాజిత్తు కార తాను
క్షమను వేడెను అందరి సముఖముననె

కం॥ మన్నింపుమయ్య కృష్ణా!
నన్నీవిటు కరుణతోడ నళినదళాక్షా!
కన్నియ మదీయ పుత్రిక
ఎన్నగ నాసత్యభామ నిత్తును మామై

వ॥ వసుదేవ బలరామాది పెద్దల ఆశీర్వచనములతో, స్వయముగా రుక్మిణీదేవి జరిపించగా ఆ శ్రీకృష్ణుడు జాంబవతిని, సత్యభామను పరిణయమాడెను.

తే॥ పెండ్లి జూచుట కొచ్చిన వేల్పులెల్ల
నీవు విష్ణుడవవుటచే నీకు కలుగు
ఇట్టి నీలాపనిందల నెన్ని గావ
మాకు సాధ్యమే? దెల్పుము మార్గమేదొ

వ॥ దానికి శ్రీకృష్ణుడు చిరునవ్వుతో ఇట్లనెను

కం॥ ఆ విఘ్నచవితి రోజున
సేవలు పూజలను జేసి శ్రీగణపతికిన్
ఏవారీ కథ విందురొ
ఆవారికి గౌరి శాపమంటదు నికపై

వ॥ దానికి అందరూ సంతోషించి భాద్రపద శుద్ధ చవితినాడు భక్తితో వినాయకుని పూజించుచు చంద్రదర్శన దోషమునుండి విముక్తులైరి. అని చెప్పి సూతుడు శౌనికాది మునులను ఆనందబరచెను.

## వ్రతకథ సంపూర్ణం

❀ ❀ ❀

కర్పూర హారతిచ్చి ఈ మంగళం పాడవలయును

# మంగళ హారతి

మంగళ హారతి మా గణపతికిని
మంగళ కరునకు మహిమల వేల్పుకు

మంగళ హారతి మా శివపుత్రుకు
మంగళ ఒడి తను మన్నినవానికి

మంగళ హారతి మనస్కందు గురుకు
మంగళమగు నీ మహి జనులకును

మంగళహారతి మన విఘ్నములను
మంగళకరముగ మాన్పెడి వానికి

❀ ❀ ❀

## నైవేద్యం పెట్టుట

మంగళం తరువాత మనం తినబోయే అన్నం కూరలు, పళ్ళు, ఉండ్రాళ్ళు దేవుని ముందు ఉంచి చేత్తో నీళ్ళు తీసుకుని వాటిపై చల్లి కుడిచేయి దేవునికి చూపిస్తూ ఓ మహా గణాధిపతీ భక్తిపూర్వకంగా నేనిచ్చే ఈ నైవేద్యం స్వీకరించి మమ్ము దయచూడుము.

ఓం ప్రాణాయ స్వాహా, ఓం అపానాయ స్వాహా, ఓం వ్యానాయ స్వాహా, ఓం ఉదానాయస్వాహా, ఓం సమానాయస్వాహా అంటూ ఐదుసార్లు చూపించి నైవేద్యం సమర్పయామి అని కొన్ని నీళ్ళు వదిలి ముగించాలి.

## అక్షతలు తయారుచేయు విధానము

పసుపు మరియు కొంచెం నూనెతో బియ్యం తడిపి అక్షతలు తయారు చేయాలి.

## ఉండ్రాళ్ళు తయారు చేయుట

అరగ్లాసు నీళ్ళు మరగబెట్టి అందులో ఒకగ్లాసు బియ్యంపిండి వేసి కలిపి గట్టిగా అయినాక వుండలుగా చేసుకుని ఆవిరిపైన ఉడకబెట్టాలి.

## కుడుములు తయారు చేయుట

ముందుగా పచ్చిశనగ పప్పు నానబెట్టి, మూడుగ్లాసులు నీళ్ళు మరిగించి అందులో రెండుగ్లాసులు బియ్యపు రవ్వ వేసి దానిలో శనగ పప్పు వేసి కలిపి మూతపెట్టి (ఉడకనివ్వాలి) ఐదునిమిషాలు ఉంచాలి. తరువాత దానిని వుండలుగా చేసుకుని ఆవిరిపైన ఉడకబెట్టాలి.

## పూజకు కావలసిన సామాగ్రి

| | |
|---|---|
| పసుపు | వక్కలు |
| కుంకుమ | అగరువత్తులు |
| బెల్లం | కర్పూరం |
| పేలాలు | దూది (ప్రత్తి) |
| నూనె | పూలు |

అరటి పండ్లు
కొబ్బరికాయలు
గ్లాసు (నీటితో)
చెంచా (హారతికి పెద్దది)
గ్లాసులో చెంచా
(ఆచమనానికి)
చిన్న తుండుగుడ్డ
గణపతి బొమ్మ
(చిన్న పూలమాలతో)

జంధ్యం
అక్షతలు
దానిమ్మకాయ
అరటి పళ్ళు
వెలగపండు
ఒక చిన్న స్టూల్(వేదిక)
పత్రి (మామిడి, బదరి,
బిల్వ, తులసి మొ॥ఆకులు

## వేదిక ఏర్పాటు

ఒక బల్లవేసి దానిపై శుభ్రమైన వస్త్రం పరచి దానిపై బియ్యం పరచి (అరకిలో) దానిపై గణపతిని చక్కగా మధ్యలో ఉంచాలి. దానికి రెండువైపులా దీపాలు, అగరొత్తులు ఉంచాలి.

## దీపారాధన

మొదట దూదిని వత్తులుగా చేసి, కుంకుమ బొట్లు పెట్టిన చిన్న గిన్నె (కుంది) లోని నూనెలో రెండు వత్తులు వేసి వెలిగించి దీపారాధన చేయాలి. ఇటువంటివి రెండు చేస్తే మంచిది గాలికి ఆరిపోకుండా జాగ్రత్త పడాలి.


## పూజకు సిద్ధమగుట

శుభ్రమైన పంచె (లుంగీ) కట్టుకుని టవల్ భుజంపై వేసుకుని పూజ చేస్తే మంచిది. పిల్లల బుక్స్ మీకు కావలసిన బుక్స్ పూజ దగ్గర పెట్టాలి. పూజకి కూర్చుని కుంకుమ బొట్టు పెట్టుకుని, పిల్లలకి పెట్టి భక్తితో వినాయకుని చూచి నమస్కరించాలి.

భక్తితో గుంజీళ్ళు తీయాలి,
సాష్టాంగ దండము చేయాలి.
పూజరోజు మూడు వేర్వేరు వినాయకులకు మ్రొక్కాలి.
ఉండ్రాళ్ళు విసర్జించాలి.

## పాలవెల్లి తయారుచేయుట

వెదురు బద్దలతో ఈ క్రింది చూపిన విధంగా చేసుకోవాలి. దానికి నాలుగు మూలలా పొడవైన తాళ్ళు కట్టి దానికి పసుపు, కుంకుమ పూసి, మామిడాకులు, రకరకాల పండ్లు, పూలు, పత్రితో పాలవెల్లిని అలంకరించాలి. పూజవద్ద వినాయకుని పైన వేలాడేటట్లు దానిని కట్టాలి.



## వినాయకుని నిమజ్జనం

వినాయకుని బావిలోగాని, చెరువులోగాని నీళ్ళలో నిమజ్జనం చేసి మరల రమ్మని ఆహ్వానించాలి.